
సాక్షి ఆదిలాబాద్

మంగళవారం ၊ 6 ၊ ఫిబ్రవరి ၊ 2024



ఇంద్రాదేవికి 'మెస్రం' పూజలు..
నాగోబా జాతరలో భాగంగా మహాపూజకు అవసరమయ్యే గంగాజలం సేకరించిన మెస్రం వంశీయులు ఇంద్రాదేవి ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. 8లో▸



అప్రమత్తంగా ఉండాలి
పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సరిహద్దుల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల అన్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
34.0 /19.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమ శాతంతో పాటు పగటి ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి.

న్యూస్‌రీల్

పోలీస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా పోలీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎస్పీ గౌస్ ఆలం సోమవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నూతన ఉత్సాహంతో ప్రజలకు మరింత చేరువై విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మురళి, ఏవో భక్త ప్రహ్లాద్, అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సభ్యులు సత్యనారాయణ, దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న డీఈవో

ఆదిలాబాద్‌టౌన్: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని డీఈవో ప్రణీత అన్నారు. ఇటీవల తుప్రాన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో నేరడిగొండ కేజీబీవీ విద్యార్థులు సత్తా చాటారు. ఈ మేరకు వారికి సోమవారం డీఈవో కార్యాలయంలో మెడల్స్ బహూకరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తి కొనసాగిస్తూ జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు ఉదయశ్రీ, నారాయణ, సమగ్ర శిక్ష పర్యవేక్షకురాలు మమత, కోచ్ రవి తదితరులు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మకు దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: చేతివృత్తులపై ఆధారపడి జీవించేవారు ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం ఆర్థికసాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ పథకం అమలుపై జిల్లా స్థాయి అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎం విశ్వకర్మ యోజన పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. నిరుద్యోగులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, మంగళి, రజక, వడ్డెర, ఔసలి, కంసాలి, దర్జీ వంటి చేతివృత్తులపై ఆధారపడి జీవించేవారంతా ఈ పథకం ఆర్థికసాయా నికి అర్హులన్నారు. ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, రేషన్‌కార్డు వంటి ధ్రువీకరణ పత్రాలతో సీఎస్‌సీ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీల్లోనూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన వారిని ఎంపిక చేసి శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. వీరికి మొదటి విడతలో రూ.లక్ష రుణం మంజూరు ఉంటుందని, నిర్ణీత వ్యవధిలో చెల్లించిన వారికి తిరిగి రూ.2లక్షల రుణం అందించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం పద్మభూషణ్ రాజు, మున్సిపల్ కమిషనర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

స్పెషలాఫీసర్లకు డిజిటల్ 'కీ'లు

- ఈకేవైసీ నమోదు ప్రక్రియ షురూ

కైలాస్‌నగర్: గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన ముగియడంతో సర్పంచులు, ఉప సర్పంచులకు ఉన్నటువంటి డిజిటల్ 'కీ'లను ప్రభుత్వం రద్దు చేసింది. వారి స్థానంలో బాధ్యతలు చేపట్టిన ప్రత్యేక అధికారులకు వాటిని అందించనుంది. డిజిటల్ కీల జారీ కోసం జెడ్పీలో ప్రత్యేకకౌంటర్ ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులుగా నియామకమైన వారినుంచి ఈకేవైసీ వివరాలు సేకరిస్తున్నారు. ప్రత్యేక అధికారుల ఫొటో, ఆధార్, పాన్‌నంబర్‌తో పాటు వారి సమాచారం నమోదు చేస్తున్నారు. తొలిరోజే మెజార్టీ అధికారులు వివరాలు అందజేశారు. మంగళవారం సైతం ఈ ప్రక్రియ కొనసాగనుంది. అనంతరం వారికిడిజిటల్ కీలను అందించనున్నారు. దీంతో ఇకపై గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపునకు గాను పంచాయతీ కార్యదర్శులతోపాటు ప్రత్యేక అధికారులు డిజిటల్ కీ ద్వారా సంతకాలు చేయనున్నారు.

ఎంపీ VS ఎమ్మెల్యే





- బీజేపీలో లుకలుకలు
- సిట్టింగ్‌గా మరోసారి పోటీకి సిద్ధమవుతున్న 'సోయం'
- ఇతర పార్టీల నుంచి ఆశావహుల్ని పార్టీలోకి తెచ్చే యత్నాల్లో 'పాయల్'
- కేడర్‌లో అయోమయం

సాక్షి,ఆదిలాబాద్: పార్లమెంట్ ఎన్నికలకు ముందు బీజేపీలో లుకలుకలు చోటు చేసుకుంటున్నాయి. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు వర్సెస్ ఎమ్మెల్యే, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి పాయల్ శంకర్ మధ్య విభేదాలు ముదిరి పాకానపడ్డాయి. సిట్టింగ్‌గా మరోసారి సోయం పోటీకి సిద్ధమవుతున్నారు. మరోపక్క ఇతర పార్టీల్లోని ఆశావహుల్ని పార్టీలోకి రప్పించేందుకు పాయల్ శంకర్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. సోయంకు పోటీగా ఇతరులను ఎంపీ అభ్యర్థిగా రంగంలోకి దించేందుకు శంకర్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారని పార్టీలో ప్రచారం ఉంది. ఇటీవల వరుసగా వేర్వేరు చోట్ల జరుగుతున్న పార్లమెంట్ సన్నాహక సమావేశాలు పైకి అంతా సవ్యంగానే ఉన్నట్లు అనిపిస్తున్నప్పటికీ లోపల మాత్రం బీజేపీలో లుకలుకలను స్పష్టం చేస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

సోయంకు పోటీగా..
ఎంపీ సోయం బాపూరావుకు పోటీగా పార్టీలో ఇతర ఆశావహులను తెరపైకి తెచ్చేందుకు ఎమ్మెల్యే శంకర్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇతర పార్టీల్లోనూ ఆశావాహులను కూడా పార్టీలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇటీవల బీఆర్‌ఎస్‌కు చెందిన జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మరో ఆదివాసీ ముఖ్యనేతను పార్టీలో చేర్పించేందుకు నేరుగా వారిని ఢిల్లీకి తీసుకెళ్లినట్టుగా చర్చ సాగుతోంది. టికెట్ హామీ కండీషన్‌తో పార్టీలో చేరే విషయంలో ఢిల్లీ పెద్దలు హామీ ఇవ్వకపోగా, హైదరాబాద్‌లోనే ఆ నేతలను చేర్పించాలని తిరిగి పంపించారని ప్రచారం ఉంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ ఇటీవల చేరారు. మరో ముఖ్య నేత మాత్రం టికెట్‌పై హామీ లేకపోవడంతో చేరకుండానే జిల్లాకు తిరిగి వచ్చినట్లు చెప్పుకుంటున్నారు. మళ్లీ బీఆర్‌ఎస్ సమావేశాల్లో ఆ నేత యాక్టీవ్‌గా పాల్గొనడంతో పార్టీని వీడే యత్నాలు ముగిసినట్టేనా.. లేనిపక్షంలో ముందుముందు ఎలాంటి నిర్ణయం ఆ నేత తీసుకుంటారనే విషయంలో పార్టీలో సందిగ్ధం నెలకొంది.

సిద్ధాంతాలు ఎటుపోయాయి..

సిద్ధాంతాల పార్టీ అని చెప్పుకునే బీజేపీలో అవి మచ్చుకు కనబడటం లేదన్న అభిప్రాయం కార్యకర్తల్లోనే వ్యక్తమవుతుండడం గమనార్హం. ప్రధానంగా ఇటీవల ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడి మార్పు చోటుచేసుకోగా, అనూహ్యంగా పార్టీలో సీనియర్లను కాదని గుడిహత్నూర్ జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానందంను ఎంపిక చేయడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సీనియర్ నాయకులు సుహాసినిరెడ్డి, ఆదినాథ్ వంటి వారికి అవకాశం ఇవ్వకుండా జెడ్పీటీసీకి ఆ పదవి కట్టబెట్టడం వెనుక పార్టీలో ముఖ్య నేతల మధ్య తీవ్ర విభేదాలే కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఇదిలా ఉంటే బీజేపీ అభ్యర్థి ఎవరనేది ఇంకా ఖరారు కాకపోయినప్పటికీ భైంసా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాదవ్ రాజేశ్‌బాబు ప్రచార రథం నియోజకవర్గాల్లో తిరుగుతుండడంపై పార్టీ కార్యకర్తలే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ సిద్ధాంతాలు ఎటుపోతున్నాయన్న అభిప్రాయం వారిలో వ్యక్తమవుతుంది. ఈ పార్లమెంట్ నియోజకవర్గంలో బలమైన పార్టీగా ఉన్న బీజేపీకి నష్టం జరిగించే విధంగా పార్టీలో కార్యక్రమాలు జరుగుతుండడంతో పలువురు సీనియర్ నేతలు సైతం నిరుత్సాహంగా ఉన్నట్లు సమాచారం.



ఆదిలాబాద్ పట్టణంలో భైంసా ఏఎంసీ మాజీ చైర్మన్ జాదవ్ రాజేష్ బాబు ప్రచార రథం

కాన్పునకు ప్రభుత్వాసుపత్రికే

- సర్కారు దవాఖానాల్లో పెరిగిన ప్రసవాలు
- ఇందులో 'సాధారణ'మే అధికం
- ప్రైవేట్‌లో ఎక్కువగా సిజేరియన్లే..

బోథ్: ఒకప్పుడు ప్రభుత్వ దవాఖానాకు వెళ్లాలంటేనే జనం జంకేవారు. వీటిలో ప్రసవాలు సైతం అంతగా జరిగేవి కావు. అయితే ప్రభుత్వం తీసుకువస్తున్న పథకాలు, మెరుగైన వసతులతో చాలా మంది గర్భిణులు సురక్షిత కాన్పు కోసం సర్కారు ఆసుపత్రి బాట పడుతున్నారు. ఏటా పెరుగుతున్న ప్రసవాలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఇందులోనూ ఎక్కువగా సాధారణ కాన్పులే ఉంటున్నాయి. అత్యవసరం అయితేనే సిజేరియన్ చేస్తున్నారు. మరోవైపు ప్రైవేట్ ఆసుపత్రుల్లో కాసులకు కక్కుర్తిపడి ఆపరేషన్లకే మొగ్గుచూపుతుండడం గమనార్హం.

సాధారణ ప్రసవాలే అధికం..
జిల్లాలోని ఆయా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య గడిచిన రెండేళ్లుగా పెరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వసతులు మెరుగవడం, నాణ్యమైన ఉచిత వైద్యసేవలు అందుబాటులో ఉండడంతో పాటు సాధారణ ప్రసవాలకే ఇక్కడ ప్రాధాన్యం ఇస్తుండడంతో గర్భిణులు ఈ ఆసుపత్రుల బాట పడుతున్నారు.

ప్రైవేట్‌లో సీజేరియన్లే..
ప్రైవేట్ దవాఖానల్లో అక్కడి వైద్యులు నార్మల్ డెలివరీకి అవకాశం ఉన్నా సిజేరియన్‌కే ప్రాధాన్యమిస్తున్నారు. వీటిలో దాదాపు 80 నుంచి 90శాతం వరకు ఆపరేషన్లే ఉంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా నర్సింగ్‌హోంలలో ఒక్కో ప్రసవానికి దాదాపు రూ.30వేల నుంచి రూ.40వేల వరకు ఖర్చవుతోంది. పేద, మధ్య తరగతి వారికి ఇది భారంగా మారుతుంది.

రెండేళ్లుగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రసవాల వివరాలు..

సంవత్సరం	ప్రభుత్వ	ప్రైవేట్
2022–23	9,749	3,584
2023–24 (ఇప్పటివరకు)	7,911	3,121

జిల్లాలోని ఆసుపత్రులు..

మెడికల్ కళాశాల	01
జిల్లా ఆసుపత్రి	01
ఏరియా ఆసుపత్రి	01
సీహెచ్‌సీలు	03
పీహెచ్‌సీలు	22
అర్బన్ పీహెచ్‌సీలు	5
ప్రైవేట్ ఆసుపత్రులు	73



బోథ్ సీహెచ్‌సీలో ప్రసవించిన మహిళలు (ఫైల్)

90 శాతం సాధారణ ప్రసవాలు

జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో 90 శాతం సాధారణ ప్రసవాలే నమోదవుతున్నాయి. ప్రతీనెల గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు వారి ఇళ్ల వద్దకు వెళ్లి సాధారణ కాన్పుపై అవగాహన కల్పిస్తున్నారు. అత్యవసరం అయితే తప్ప సిజేరియన్ చేయడం లేదు. ఈ క్రమంలోనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య భారీగా పెరిగింది. మహారాష్ట్ర నుంచి కూడా చాలామంది కాన్పు కోసం జిల్లాకు వస్తున్నారు.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

కొత్త స్టాఫ్‌నర్సులొచ్చారు

- విధుల్లో చేరుతున్న వైనం
- రిమ్స్‌కు 164 పోస్టులు కేటాయింపు
- పేదలకు మరింత నాణ్యమైన సేవలు

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వం ఇటీవల స్టాఫ్‌నర్సు పోస్టులను భర్తీ చేసిన విషయం తెలిసిందే. జిల్లా నుంచి 282 మంది ఎంపికయ్యారు. అయితే రాజీవ్ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)కు 164 పోస్టులు, వైద్యారోగ్య శాఖకు 9 పోస్టులు కేటాయించారు. ప్రస్తుతం రిమ్స్‌లో కేటాయించిన స్టాఫ్ నర్సులు విధుల్లో చేరుతున్నారు. సోమవారం 53 మంది రిపోర్టు చేశారు. కాగా ఆదివారం 67 మంది విధుల్లో చేరారు. మిగతా వారు త్వరలో చేరే అవకాశాలున్నాయి. ఉద్యోగం పొందిన 15 రోజుల వరకు విధుల్లో చేరేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. వీరికి రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా నుంచి ఎంపికైన స్టాఫ్ నర్సులకు బాసర జోన్ పరిధిలోని ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో పోస్టింగ్ కల్పించారు. కాగా రిమ్స్‌లో మొత్తం స్టాఫ్‌నర్సు పోస్టులు 351 మంజూరు ఉండగా, ప్రస్తుతం 128 మంది రెగ్యులర్, 49 మంది కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్నారు. 223 పోస్టులు ఖాళీగా ఉండగా, ప్రభుత్వం 164 పోస్టులు కేటాయించడంతో మరో 59 రెగ్యూలర్ పోస్టులు భర్తీ కావాల్సి ఉంది. అయితే ఇప్పటికే కాంట్రాక్ట్ ఉద్యోగులు సైతం విధులు నిర్వహిస్తుండడంతో వారినే కొనసాగించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. వీరి కాంట్రాక్ట్ గడువు మార్చి 31 వరకు ఉంది. వీరిని తొలగిస్తారా.. కొనసాగిస్తారా అనే విషయాన్ని ప్రభుత్వం స్పష్టం చేయలేదు. దీంతో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. రిమ్స్‌తో పాటు జిల్లాలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో సైతం స్టాఫ్ నర్సులను కేటాయించారు. విద్యార్థుల అనారోగ్యం బారిన పడితే వారికి వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం గురుకులాలకు సైతం ఈ పోస్టులను కేటాయించింది. ఇదిలా ఉండగా జిల్లా వైద్యారోగ్య శాఖ పరిధిలో ఖాళీగా ఉన్న తొమ్మిది పోస్టులను త్వరలో భర్తీ చేసే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

రిమ్స్‌లో ఇక నాణ్యమైన సేవలు..
నిత్యం రోగులతో కిటకిటలాడే రిమ్స్‌కు కొత్త స్టాఫ్‌నర్సుల రాకతో పేదలకు మరిన్ని నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులోకి వస్తున్నాయి. ఇక్కడ మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, 2 నుంచి రాత్రి 8 గంటల వరకు, రాత్రి 8 నుంచి ఉదయం 8గంటల వరకు పనిచేస్తారు. వైద్యులు అందుబాటులో లేనప్పటికీ రోగులకు స్టాఫ్‌నర్సులే అన్నితామై వైద్యసేవలు చేస్తారు. పోస్టుల భర్తీతో మిగతా సిబ్బందిపై పనిభారం తగ్గనుంది. రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందనున్నాయి.



రిమ్స్ డైరెక్టర్‌కు రిపోర్టు చేస్తున్న స్టాఫ్ నర్సులు

120 మంది విధుల్లో చేరారు


ప్రభుత్వం రిమ్స్‌కు 164 స్టాఫ్‌నర్సు పోస్టులను కేటాయించింది. దీంతో రోగులకు మరిన్ని నాణ్యమైన వైద్యసేవలు అందించే వీలుంటుంది. ఇదివరకు 223 పోస్టులు ఖాళీగా ఉండగా, ఈ పోస్టుల భర్తీ జరిగింది. ఇప్పటి వరకు 120 మంది రిపోర్టు చేశారు. మిగతా వారు త్వరలో విధుల్లో చేరనున్నారు.

– జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా
- నాగోబా జాతర ఏర్పాట్లపై సమీక్ష

ఉట్నూర్‌రూరల్: నాగోబా జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని ఇన్‌చార్జి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయంలోని తన చాంబర్‌లో జాతర ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సోమవారం సాయంత్రం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజనుల ఆరాధ్య దైవం నాగోబా జాతరను ఘనంగా, సాంప్రదాయబద్ధంగా నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఈనెల 9 నుంచి 15 వరకు నిర్వహించనున్న జాతరకు భక్తులు అధికసంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున శానిటేషన్‌పై దృష్టి సారించాలన్నారు. హైపోక్లోరైడ్ ద్రావణం పిచికారీ నిరంతరం చేపట్టాలన్నారు. హైమాస్ట్ లైట్లతో పాటు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. నీటిసరఫరా, మరుగుదొడ్లు, పార్కింగ్, బారికేట్స్ అవసరమైన మేరకు ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠ బందోబస్తు కల్పించాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా వంటి పనులు సమన్వయంతో చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డీడీ దిలీప్‌కుమార్, డీఎస్పీ నాగేందర్, ఈఈ రాథోడ్ భీంరావు, ఏపీవో భాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

సమస్యల నివేదన



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- ప్రజావాణికి వినతుల వెల్లువ
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ఇంటి స్థలం కావాలని ఒకరు.. భూ సమస్యలు పరిష్కరించాలని మరొకరు.. పింఛన్ రావడం లేదని ఇంకొకరు.. ఇలా ఆయా సమస్యలపై ప్రజావాణిలో అర్జీలు వెల్లువెత్తాయి. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి కలెక్టర్ రాహుల్‌రాజ్ దరఖాస్తులు స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్జీలను సంబంధిత అధికారులకు అందజేస్తూ పరిష్కరించాలని ఆదేశించారు. ఈ వారం అర్జీదారుల్లో కొందరి నివేదన..

పాఠశాలకు పక్కా భవనం మంజూరు చేయాలి

ఆదిలాబాద్ పట్టణం 12వ వార్డు న్యూహౌసింగ్‌బోర్డు పరిధిలోని ఆదిత్యనగర్‌లో గల ప్రభుత్వ పాఠశాలకు పక్కా భవనం మంజూరు చేసి, నిర్మించాలని యువజన కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌ను ప్రజావాణిలో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగారాజు, సామ రూపేష్‌రెడ్డి, శేఖర్, మల్లయ్య, రంజిత్‌రెడ్డి, కాలనీవాసులు తదితరులున్నారు.

రోడ్డు ఆక్రమణలు ఆపాలి



2015లో వడూర్ నుంచి మా గ్రామానికి మట్టి రోడ్డు మంజూరైంది. అప్పటివరకు ఎలాంటి ఆటంకం లేకుండా రాకపోకలు సాగేవి. అయితే 2023 జూన్‌లో ఓ వ్యక్తి రోడ్డు భూమి తమదంటూ ఆక్రమించాడు. పక్కనున్న చెరువు ద్వారా వెళ్లాలని దబాయిస్తున్నాడు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం.

– యువకులు, దంతాండ, నేరడిగొండ మండలం

అక్రమ పట్టా రద్దు చేయాలి



సిరిచెల్మ శివారు సర్వేనం.63లో 2.6 ఎకరాలు, సర్వేనం.77లో 2.27 ఎకరాలు, సర్వేనం.122లో 8.01 ఎకరాల భూమిలో మా కుటుంబం తాతల కాలంగా కాస్తులో ఉంది. ఈ భూమిని గ్రామానికి చెందిన కొందరు మాకు తెల్వకుండా పట్టా చేసుకున్నరు. మమ్మల్ని చేనులోకి రానివ్వకుండా బెదిరిస్తున్నరు. అక్రమ పట్టా రద్దు చేసిన్యాయం చేయాలి.

– నేతుల మహేశ్, సిరిచెల్మ, ఇచ్చోడ మండలం

ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి



మేము నిరుపేద ఆదిమ కొలాం గిరిజన తెగకు చెందిన ఆదివాసీలం. ఉండటానికి ఇంటి స్థలం లేదు. కూలీనాలి చేసుకుని జీవించే మాకు స్థలం కొనుగోలు చేసే స్థోమత లేదు. ప్రభుత్వ పరంగా ఇంటి స్థలాలు కేటాయించడంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలి. గతంలో అధికారులకు చాలాసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. మాపై దయచూపి ఆదుకోవాలె.

– కొలాం గిరిజనులు, కుచులాపూర్, తలమడుగు మండలం

డ్వాక్రా రుణాలు మాఫీ చేయాలి



మేమంతా సంఘమిత్ర ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యులం. ముప్పై ఏళ్లుగా సంఘాన్ని నిర్వహిస్తూ పొదుపు చేస్తున్నాం. గ్రూప్‌లో 13మంది సభ్యులం ఉండగా, అందులో ఆరుగురు మరణించారు. మిగతా ఏడుగురం కూలినాలి చేసుకొని జీవనం సాగిస్తున్నాం. ఇప్పటివరకు కట్టిన డబ్బులు వడ్డీకే సరిపోతున్నాయి. మేము తీసుకున్న అసలు రుణం అలాగే ఉంది. ఆ రుణాన్ని మాఫీ చేసి మాకు న్యాయం చేయాలి.– డ్వాక్రా సభ్యులు, లోకారి, ఆదిలాబాద్‌రూరల్ మండలం

'నా భూమిని మరొకరికి అక్రమంగా పట్టా చేశారు..'

కైలాస్‌నగర్: తనకు వారసత్వంగా రావాల్సిన సాగు భూమిని రెవెన్యూ అధికారులు మరొకరి పేరిట అక్రమంగా పట్టా చేసి ఇచ్చారని బేల మండలం కాప్సి–బి గ్రామానికి చెందిన ప్రమోద్ బేడొడ్కర్ తెలిపారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది డబ్బులు తీసుకుని తాను బతికుండగానే తన భూమిని సోదరుడి భార్య పేరిట పట్టాచేసి ఇచ్చారంటూ విలపించాడు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నాడు. కలెక్టర్ స్పందిస్తూ.. ధరణి అమల్లోకి వచ్చాక పట్టా రద్దు చేసే అధికారం తనకు లేదని, కుటుంబ వివాదాన్ని కోర్టులో చూసుకోవాలని సర్దిచెప్పే యత్నం చేశారు. బాధితుడు విన్పించుకోకుండా గట్టిగా అరవడంతో పోలీసులు జోక్యం చేసుకుని బయటకు పంపారు. అనంతరం బాధితుడు మీడియాతో మాట్లాడుతూ.. తాను ఉపాధి నిమిత్తం దుబాయి వెళ్లానని, తిరిగివచ్చాక తన భూమిని అక్రమంగా పట్టాచేసి ఇచ్చినట్లుగా తెలిసిందన్నారు. కలెక్టర్‌ను కలిస్తే కోర్టుకు వెళ్లమంటున్నారన్నారు. రాష్ట్రస్థాయిలో ఫిర్యాదుచేయనున్నట్లు తెలిపారు.



కలెక్టర్‌తో వాదనకు దిగిన బాధితుడు

క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్ట్

భైంసాటౌన్(ముధోల్): పట్టణంలోని గోపాల్ నగర్‌లో గల ఓ ఇంట్లో పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ రాజారెడ్డి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి దాడిచేసి ఫారెస్ట్ కార్యాలయం సమీపంలోని ఓ ఇంట్లో గుట్టుగా జూదం ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.70,230 నగదు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక బీఫ్ మార్కెట్ వద్ద మట్కా నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీ చేయగా సయ్యద్ జాబీర్ అనే వ్యక్తి సాయంతో ఓవైసీనగర్‌కు చెందిన కాంపల్లి రాజు మట్కా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఈమేరకు రాజును అదుపులోకి తీసుకుని, అతని వద్ద రూ.2,840 నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. సయ్యద్ జాబీర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు వైద్యపరీక్షలు


పరీక్షల కోసం హాజరైన కానిస్టేబుల్ అభ్యర్థులు

ఆదిలాబాద్‌టౌన్: కానిస్టేబుల్ అభ్యర్థులకు రిమ్స్ ఆస్పత్రిలో సోమవారం మెడికల్ టెస్ట్ (వైద్య పరీక్షలు) నిర్వహించారు. ఈ ప్రక్రియను రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌తో పాటు నోడల్ అధికారి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ పరిశీలించారు. నాలుగు బృందాలను ఏర్పాటు చేయగా ఒక్కో బృందానికి రోజుకు 20 చొప్పున 20 మందికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 362 మంది అభ్యర్థులకు ఈ పరీక్షలు చేపట్టనున్నట్లు చెప్పారు. కంటి పరీక్షలతో పాటు అన్నిరకాల పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రక్రియను పారదర్శకంగా చేపడతామని తెలిపారు.

'మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలం'



మాట్లాడుతున్న గీతారెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: మహిళలకు రక్షణ కల్పించడంలో గత, ప్రస్తుత ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతారెడ్డి ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మహేశ్వర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఇతర మోర్చాలతో సమానంగా బీజేపీ మహిళా మోర్చా పనిచేస్తుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్‌కు గాయాలు

ఖానాపూర్: రోడ్డు ప్రమాదంలో మండలంలోని సింగాపూర్ గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ రామకృష్ణకు గాయాలయ్యాయి. ఆదివారం రాత్రి ఖానాపూర్ నుంచి సింగాపూర్ గ్రామానికి వెళ్తుండగా ఖానాపూర్–నిర్మల్ ప్రధాన రహదారిపై ఎక్బాల్‌పూర్ శివారులో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు108లో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.


ఇంద్రాదేవికి మొక్కుతున్న మెస్రం వంశీయులు


మర్రిచెట్టు వద్ద గంగాజలం భద్రపరుస్తున్న మెస్రం పెద్దలు


నైవేద్యాలు తయారు చేస్తున్న మెస్రం ఆడపడుచులు


కేస్లాపూర్ మర్రిచెట్టు వద్ద మెస్రం వంశీయులు

ఇంద్రాదేవికి 'మెస్రం' పూజలు..

- అనంతరం కేస్లాపూర్‌కు పయనం
- మర్రిచెట్టు వద్ద బస

ఇంద్రవెల్లి: నాగోబా జాతరలో భాగంగా మహాపూజకు అవసరమయ్యే గంగాజలం సేకరించిన మెస్రం వంశీయులు పాదయాత్రగా సోమవారం ఇంద్రవెల్లికి చేరుకున్నారు. ఇంద్రాదేవి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. పవిత్ర గంగాజలాన్ని ఆలయం ఎదుట ఉన్న మర్రి చెట్టుపై భద్రపరిచారు. వీరి రాక నేపథ్యంలో ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి 22 కితల మెస్రం వంశీయులు ఎడ్ల బండ్లతో ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయం ప్రకారం నైవేద్యాలు తయారు చేసి అమ్మవారికి సమర్పించారు. రాత్రి కేస్లాపూర్ సమీపంలోని మర్రి చెట్టు వద్దకు చేరి అక్కడే బస చేశారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు సంప్రదాయ పూజలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రధాన్ కితకు చెందిన దాదారావ్ ఆధ్వర్యంలో నాగోబా చరిత్ర బోధిస్తారు. ఈ నెల 9న రాత్రి 10:30 గంటలకు మహాపూజ అనంతరం జాతర ప్రారంభించనున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి వెంకట్‌రావ్ తెలిపారు. కార్యక్రమంలో మెస్రం వంశపెద్దలు కోసు కటోడా, కోసేరావ్, దాదారావ్, హనుమంత్ రావ్, తిరుపతి తదితరులున్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. నార్నూర్ మండలం జుండా గ్రామానికి చెందిన ఆత్రం అమృత వైద్య చికిత్సకు ఆర్థికసాయం అందించాలని, ఉట్నూర్‌కు చెందిన సెద్మకి సంధ్య కుట్టు మిషన్ అందించాలని, జైనూర్ మండలం పానాపటార్ గ్రామస్తులు ఇండ్లు మంజూరు చేయించాలని, జైనూర్ మండలం దబోలి గ్రామానికి చెందిన సిడాం ముత్తా ఆయిల్ ఇంజన్ ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో కనక భీంరావు, ఈఈ భీంరావు, ఏఓ రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, ఆర్సీవో గంగాధర్, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

రిమ్స్ డైరెక్టర్‌కు సమ్మె నోటీసు

ఎదులాపురం: రిమ్స్‌లో పనిచేస్తున్న కార్మికులు సోమవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ ఆధ్వర్యంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు సమ్మె నోటీసును అందించారు. రిమ్స్‌లో పని చేస్తున్న కార్మికులందరూ ఈనెల 16 కార్మిక, రైతు సంఘాలు నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బంద్‌లో పాల్గొంటారని, వారందరికీ సహకరించాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు కూడా సమ్మెలో భాగస్వాములు కావాలన్నారు. పరిశ్రామిక విధానాల చట్టం 1947సెక్షన్ –22, సబ్ సెక్షన్ (1) అనుసరించి ఈ సమ్మె నోటీసు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, జిల్లా కమిటీ సభ్యులు పి.పోచన్న, ఆర్.సురేందర్, నాయకులు నరేశ్, ఇమ్రాన్ ఆలీ, దశాంత్, తదితరులు పాల్గొన్నారు.


సమ్మె నోటీసు అందజేస్తున్న అన్నమొల్ల కిరణ్

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

కడెం: గత నెల 31న అదృశ్యమైన మధ్యప్రదేశ్‌కు చెందిన కార్మికుడి మృతదేహం సోమవారం కడెం ప్రాజెక్టులో లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మధ్యప్రదేశ్‌లోని బాలఘట్ జిల్లా లాల్‌బురా తాలుకా బడ్‌గావ్ గ్రామానికి చెందిన గౌతం దేవేంద్ర (30) ఏపీకి చెందిన మరి కొందరు కార్మికులతో కలిసి కొద్ది రోజులుగా కడెం ప్రాజెక్ట్ దిగువన డ్రిల్లింగ్ పనులు చేస్తున్నాడు. గత నెల 31న రాత్రి ప్రాజెక్ట్ వద్ద వారు ఉంటున్న రూం నుంచి బయటకు వెళ్లాడు. తోటి కార్మికులు ఉదయం చూసేసరికి దేవేంద్ర కనిపించకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో ఈ నెల 2న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం ప్రాజెక్ట్‌లో మృతదేహం బయటకు తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ మోహన్, ఇన్‌చార్జి ఎస్సై ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

భైంసాలో ఇద్దరి ఆత్మహత్య


శంకర్ (ఫైల్)


ఆహద్ (ఫైల్)

భైంసాటౌన్(ముధోల్): పట్టణంలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టులో దూకి ఒకరు, ఇంట్లో ఉరేసుకుని మరొకరు సోమవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఆమోస్ తెలిపారు. కుంట ప్రాంతానికి చెందిన ఆహద్ (30) స్థానికంగా లేబర్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య డబ్బు విషయమై గొడవ కారణంగా ఇంటి నుంచి వెళ్లి గడ్డెన్నవాగు ప్రాజెక్టు నీటిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని వెలికితీయించే పనిలో ఉన్నారు. మార్వాడిగల్లికి చెందిన శంకర్ (30) కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నర్సాపూర్(జి): మండలంలోని బూరుగుపల్లి(జి) 61వ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు... భైంసా మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన చాకటి వర్ధన్, సతీష్ ద్విచక్ర వాహనంపై నిర్మల్ వైపు వెళ్తుండగా భైంసా వైపు వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి ఢీ కొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన పెందూర్ రమేశ్ అదృశ్యమైనట్లు అతని భార్య పెందూర్ అనిత టూటౌన్ పోలీసు స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు. గతేడాది సెప్టెంబర్ 25న ఇంట్లో గొడవపడి వెళ్లిపోయాడని, అప్పటి నుంచి అతని ఆచూకీ కోసం గాలించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

కుంటాల: మండలంలోని సూర్యాపూర్‌లో సోమవారం పిచ్చికుక్క పలువురిపై దాడి చేసింది. గ్రామానికి చెందిన రిక్కల సుదర్శన్, బక్కి మమతకు, బక్కి శ్రీకాంత్‌ను గాయపర్చింది. రొడ్డ గంగా ప్రసాద్‌ను వెంబడించగా పరిగెత్తే క్రమంలో అతని కాలు విరిగింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కుంటాల, భైంసా ఆస్పత్రులకు తరలించారు. బక్కి సాయినాథ్, దొంతుల మల్లేష్ ఎడ్లపై కూడా పిచ్చికుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి.


గాయపడిన హైమద్

కుంటాలలో స్వైర విహారం...

మండల కేంద్రంలో సోమవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. ఆరోతరగతి చదువుతున్న హాస్టల్ విద్యార్థి గణేశ్, ఆటో దశరథ్ ,పోస్ట్ హైమద్, కటికే వంశీలపై దాడి చేసి గాయపరిచింది. గ్రామస్తులు వెంబడించి కుక్కను హతమార్చారు. ఆదివారం రాత్రి అందాకూర్‌లో పలువురిపై దాడిచేయడంతో గాయాలైనట్లు తెలిసింది.

సరిహద్దుల్లో అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ జానకి షర్మిల
- నాందేడ్‌లో తెలంగాణ, మహారాష్ట్ర పోలీసు అధికారుల సమావేశం


సమావేశంలో పాల్గొన్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్‌టౌన్: పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సరిహద్దుల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, సమాచారం పరస్పరం షేర్ చేసుకోవాలని ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల అన్నారు. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు జిల్లాల పోలీస్ అధికారులతో నాందేడ్ రేంజ్ డీఐజీ శశికాంత్ మహావర్కర్ నాందేడ్‌లో సోమవారం బార్డర్ సమావేశం నిర్వహించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రెండు నెలల ముందు నుంచే సరిహద్దు పోలీసు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అక్రమంగా తరలించే మద్యం , నగదును అడ్డుకోవాలని సూచించారు. సరిహద్దు గుండా అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఇవ్వకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షిస్తూ అవసరమైన మార్గదర్శనం చేసేందుకు మూడు అంచెల్లో అధికారులకు బాధ్యతలను అప్పగించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మహారాష్ట్ర పోలీసు అధికారులతో ఎప్పటికప్పుడు సమాచార వ్యవస్థను పరస్పర మార్పిడి చేసుకోవడంతోనే ఎన్నికలను సజావుగా ముగించవచ్చని చెప్పారు. ఎన్నికలలో ధనం, మద్యం పాత్ర విశేషంగా ఉంటుందని వాటిని అరికట్టడానికి ఇరు రాష్ట్రాల సరిహద్దు పోలీసులు ఇప్పటినుండి సంసిద్ధంగా ఉండాలన్నారు.

మావోయిస్టులను జిల్లాలోనికి రానివ్వకుండా సరిహద్దు ప్రాంతాల్లో నిరంతరం కూంబింగ్ చేస్తూ బహుముఖ వ్యూహం రచించాలని పిలుపునిచ్చారు. అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలంగాణ పోలీసులు ప్రస్తుతం వినియోగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ సింగినవార్, నాందేడ్ ఎస్పీ శ్రీకృష్ణ కొకటే, కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ, ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం, బీదర్ ఎస్పీ చెన్నా బసవన్న, అదనపు ఎస్పీ నాందేడ్ అభినాష్ కుమార్, భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, బోర్డర్ పోలీస్ స్టేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు అదుపుతప్పి బోల్తా


బోల్తా పడిన ఆర్టీసీ బస్సు


బాధితులను పరామర్శిస్తున్న జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి

- డ్రైవర్‌తో సహా ఐదుగురికి గాయాలు

తాంసి: మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ఆర్టీసీ బస్సు అదుపుతప్పి బోల్తా పడిన ఘటన తలమడుగు మండలంలోని చర్లపల్లి సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. జిల్లా కేంద్రం నుంచి టీఎస్‌ఆర్టీసీ చెందిన టీఎస్ 01యూసీ 6541 బస్సు ప్రయాణికులను తీసుకోని ఝరి పూనగూడ వెళ్తుండగా చర్లపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో బస్సు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి బోల్తా పడింది. ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న ఐదుగురితో పాటు డ్రైవర్ అజయ్‌కు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను అంబులెన్స్ ద్వారా రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మరో పది నిమిషాల్లో బస్సు దిగి ఇంటికి చేరుకునే సమయంలో ఇలాంటి ఘటన జరుగడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. తలమడుగు ఏఎస్సై సురేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


ప్రమాదంలో గాయపడిన ఆర్టీసీ బస్సు డ్రైవర్


సంఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎం....

ఆర్టీసీ డీఎం కల్పన సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గాయాలైన వారి వివరాలు సేకరించారు. ప్రమాదం జరిగిన తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. బాధితులను తలమడుగు జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి పరామర్శించారు.

ఆ ఉపాధ్యాయుడికి మరోచోట పోస్టింగ్

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తిస్తూ సస్పెన్షన్‌కు గురై ఇటీవల మళ్లీ అదే పాఠశాలలో విధుల్లో చేరిన ఉపాధ్యాయుడిని మరో చోటికి బదిలీ చేశారు. ఈ మేరకు డీఈవో ప్రణీత సోమవారం నేరడిగొండ ఉన్నత పాఠశాల నుంచి ఉట్నూర్ మండల కేంద్రంలోని యూపీఎస్ పాఠశాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న సమయంలో ఉపాధ్యాయుడిని నేరడిగొండ పాఠశాలకు కేటాయించకపోవడంతో విద్యార్థులకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు లేకపోవడంతో తమకు చదువు పరంగా ఇబ్బందులు ఎదురవుతాయని, మరో ఉపాధ్యాయుడిని కేటాయించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీతను వివరణ కోరగా మండలంలో సర్దుబాటు చేసేందుకు చర్యలు చేపట్టగా ఆయా గ్రామాల్లోని ప్రజలు ఆ ఉపాధ్యాయుడిని తమ గ్రామంలోని పాఠశాలకు కేటాయించవద్దని పేర్కొనడంతో ఉట్నూర్‌లోని యూపీఎస్ పాఠశాలకు పంపించినట్లు పేర్కొన్నారు. నేరడిగొండ పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడతామని వివరించారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి


కదిరి ఆశన్న (ఫైల్)

తాంసి: తలమడుగు మండలంలోని డోర్లి శివారులో రైలు ఢీకొన్న ఘటనలో పిప్పల్‌కోటికి చెందిన కదిరి ఆశన్న (72) మృతి చెందాడు. మృతుడు తలమడుగు మండలంలోని ఝరిలో ఉంటున్న కూతురు ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో డోర్లి గ్రామ సమీపంలో రైల్వే గేటు వద్ద పట్టాలు దాటుతుండగా ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్ర వైపు వెళ్తున్న రైలు ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వృద్ధుడికి సరిగ్గా చెవులు వినిపించవని, కళ్లు సైతం సరిగా కనిపించవని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

అమ్మవారికి చేనేత పట్టుచీర


చీర నేస్తున్న పద్మశాలీ సంఘం సభ్యులు


ఆలయంలో పూజలు చేస్తున్న అందెశ్రీ

- మగ్గంపై నేస్తున్న పద్మశాలీ సభ్యులు

భైంసా(ముధోల్): వసంత పంచమికి సరస్వతీ అమ్మవారికి సమర్పించేందుకు బాసరకు చెందిన పద్మశాలీ సంఘం సభ్యులు చేనేత పట్టుచీరను సమర్పించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. సోమవారం సంఘ భవనంలో పూజలు చేసి చేనేత పనులు ప్రారంభించారు. మగ్గంపైనే పట్టుచీరను తయారుచేసి అమ్మవారికి సమర్పిస్తున్నారు. అమ్మవారికి పద్మశాలీ అన్నసత్రం నుంచి ఏటా చేనేత చీర సమర్పించడం అదృష్టంగా భావిస్తున్నట్లు సత్రం అధ్యక్షుడు సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలీ సంఘం అధ్యక్షులు స్వామి, శ్రీశైలం అధ్యక్షులు సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న అందెశ్రీ

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారిని ప్రముఖ గేయ రచయిత అందెశ్రీ సోమవారం దర్శించుకున్నారు. జయజయహే తెలంగాణ అనే పాట తాను రాశానని అమ్మవారి అనుగ్రహంతో రాష్ట్రీయ గీతంగా ఈ పాటను ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు. ఆలయ వైదిక బృందం అమ్మవారి ఆశీస్సులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బాసర ఆలయంలో వేలం పాట

భైంసా: బాసర గోదావరి తీరంలో గల ఆలయ అనుబంధ దేవాలయం విఠలేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన భూమిలో సోమవారం వేలం పాట నిర్వహించారు. బహిరంగవేలం పాటలో సర్వేనంబర్ 438లో గల హోటల్‌తోపాటు మరోషాపునకు బహిరంగవేలం నిర్వహించారు. సీల్డ్ టెండర్‌లో హెచ్చుపాట శాఖాహార హోటల్‌కు రూ.18లక్షల 25 వేలు, మరో షాపు నిర్వాహణకు రూ.16 లక్షల వేయి వచ్చినట్లు ఆలయ ఈఓ విజయరామారావు తెలిపారు. ఏడాది కాలపరిమితికి వేలం పాట నిర్వహించినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

- పాఠశాల ఎదుట ఏబీవీపీ ఆందోళన

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఓ విద్యార్థిని ఉపాధ్యాయుడు అకారణంగా చితకబాదాడని ఆరోపిస్తూ సోమవారం పాఠశాల ఎదుట ఏబీవీపీ నాయకులు ఆందోళనకు దిగారు. సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కేతన్‌ను సోమవారం ఉపాధ్యాయుడు కొట్టడంతో తలకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఏబీవీపీ నాయకులు పాఠశాలకు చేరుకొని ధర్నా నిర్వహించారు. పాఠశాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థిని దండించిన ఉపాధ్యాయునిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘు, నగర కార్యదర్శి అఖిల్, నాయకులు శశాంక్, శ్రీనీత్, ఆది, తదితరులు పాల్గొన్నారు.


గాయపడిన విద్యార్థి